సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

భిక్షాటన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సూర్యాపేట, డిసెంబర్ 23: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్ష సోమవారంతో 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రుల ఫేస్ మాస్క్ ధరించిన వారి వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు భిక్షాటన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, గోదాకృష్ణ, కమలాక్షి, మురళి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి'

తుంగతుర్తి: పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

తుంగతుర్తి, డిసెంబర్ 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రేపాల మదన్‌మోహన్, రీజనల్ చైర్మన్ గుడిపూరి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట ఆధ్వర్యంలో రూ.20 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో త్వరలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పిచ్చయ్య, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం సహదేవ్, పీడీ యాకయ్య, ఉపాధ్యాయులు నవీన్‌ప్రసాద్, కృష్ణవేణి, రవి, రాజన్న, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంఏఎం ప్రభుత్వ పాఠశాలకు రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పీఎంజేసీ రేపాల మదన్‌మోహన్, ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి, వెంకటేశ్వరరావు, సుధాకర్, నాతి సవేందర్‌కుమార్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

'రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి'

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గరిడేపల్లి, డిసెంబర్ 23: మండల పరిధిలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సోమవారం ప్రపంచ రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ జాయింట్ డైరెక్టర్ డా. ఎ.మరియదాస్ హాజరై మాట్లాడారు. రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని సూచించారు. సమగ్ర వ్యవసాయ విధానాలు పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డి.నరేశ్, సస్యరక్షణ శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, ఎన్.సుగంధి, సీహెచ్ నరేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్

డిప్యూటీ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

గరిడేపల్లి, డిసెంబర్ 23: ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తాసీల్దార్ స్రవంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నందిపాటి మట్టయ్య, మాజీ సర్పంచ్ రాచపల్లి రామస్వామి, మండల కమిటీ సభ్యులు దోసపాటి బిక్షం, పందిరి వీరారెడ్డి, బిక్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును క్షుణ్ణంగా పరిశీలించాలి

- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి

ఓటరు నమోదుపై సమీక్షిస్తున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి

సూర్యాపేట, డిసెంబర్ 23: జిల్లాలో ఎక్కువగా కొత్త ఓట్లు నమోదైన పోలింగ్ కేంద్రం, ఎక్కువగా ఓట్లు తొలగించిన పోలింగ్ కేంద్రాలను సంబంధిత ఈఆర్ఓ(ఓటరు నమోదు అధికారి)లు క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కువ కావడానికి గల కారణాలను తెలుసుకోవాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి. బాలమాయాదేవి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి జిల్లాలో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్-2025పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరణించిన వారి ఓట్లు తొలగించే సమయంలో మరణ ధ్రువీకరణ పత్రం కానీ కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ కానీ తీసుకోవాలన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సం నాటికి జిల్లాలో ఎపిక్ కార్డులు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో ఉన్న ఫొటోలను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు.

జిల్లాలో 10.08 లక్షల ఓటర్లు : కలెక్టర్

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 1,205 పోలింగ్ కేంద్రాలు, 10,08,120 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. పురుష ఓటర్లు 4,92,446, మహిళా ఓటర్లు 5,15,617 మంది ఉన్నారని వెల్లడించారు. ఓటర్ల జాబితాపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, వేణు, తాసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

'అప్రమత్తతతో సైబర్ నేరాలను అరికట్టొచ్చు'

తిరుమలగిరి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేశ్

తిరుమలగిరి, డిసెంబర్ 23: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తతతో సైబర్ నేరాలను అరికట్టొచ్చని ప్రొబేషనరీ ఎస్ఐ సురేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాల బారినపడకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్లు మన బ్యాంక్ అకౌంట్‌లలోని డబ్బులను కొల్లగొట్టే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు, ప్రమాదాలు జరిగినపుడు 100 నంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి'

ఎంఈఓ కాటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

పాలకవీడు/నేరేడుచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ పాలకవీడు, నేరేడుచర్ల మండలాల నాయకులు సోమవారం ఆయా మండలాల ఎంఈఓలు ఇంజమూరి కాటయ్య, పుట్లూరి సత్యనారాయణరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు వెంకటేశ్వర్లు, సైదులు ఉపేందర్, శీనయ్య, రామానుజం తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు సకాలంలో పంపిణీ చేయాలి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

నేరేడుచర్ల, డిసెంబర్ 23: ప్రతి నెల 1 నుంచి 5వ తేదీలోపు ఆసరా పింఛన్లు పంపిణీ చేయాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సకాలంలో పింఛన్ పంపిణీ చేయని ప్రభుత్వ తీరును నిరసిస్తూ సంఘం నేతలతో కలిసి సోమవారం నేరేడుచర్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను తక్షణమే పెంచాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జానిమియా, కుర్ర గోపియాదవ్, లక్ష్మణ్‌రావు, నరేశ్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: పింఛన్లను సకాలంలో అందించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు, నల్లగొండ జిల్లా ఇన్‌ఛార్జి కుర్ర గోపియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గరిడేపల్లిలో సంఘం నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పింఛన్లు సకాలంలో రాక వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నరసింహులు, శశి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం

ఆదర్శ రైతులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

నేరేడుచర్ల, డిసెంబర్ 23: నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు ఆదర్శ రైతులు వెన్న పుల్లారెడ్డి, దొండపాటి నరేందర్‌రెడ్డి,కొణతం వెంకటరెడ్డి, జంపాల శ్రీనివాస్, పి.నారాయణరెడ్డి, కాసాని శ్రీను, తురక వెంకటేశ్వర్లు, వనపట్ల వెంకన్న, పోలేపల్లి నర్సిరెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జిలకర రామస్వామి, షేక్ యూసుఫ్, శ్రీనివాస్‌రావు, పూర్ణచంద్రారెడ్డి, విశ్వనాథ్, శ్రీను, కనకయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం'

నూతనకల్‌లో నిరసన తెలుపుతున్న ఏఐకేఎస్ నాయకులు

నూతనకల్, డిసెంబర్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ సోమవారం మండల కేంద్రంలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్ రెడ్డి, సంఘం నాయకులు మడ్డి అంజిబాబు, కూసు సైదులు, బత్తుల జనార్ధన్, గజ్జల కృష్ణారెడ్డి, తొట్ల అచ్చయ్య, సామా వెంకటరెడ్డి, గాజుల జానయ్య, మహేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గరిడేపల్లి, డిసెంబర్ 23: గడ్డిమందు తాగిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెం గ్రామానికి చెందిన నన్నెపంగు వెంకన్న(46) గరిడేపల్లిలోని భారత్ పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో ఇటీవల ఇల్లు కట్టుకున్నాడు. అయితే, ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి గరిడేపల్లిలోని శివనాగసాయి ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకన్నను చుట్టుపక్కల వారు గమనించి 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సూర్యాపేటకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నదాతలకు దక్కని భరోసా

- మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, డిసెంబర్ 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో దేశానికి అన్నంపెట్టే అన్నదాతల జీవితాలకు భరోసా లేకుండా పోయిందని మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి విమర్శించారు. రైతు దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ రైతాంగానికి చేసిన సేవలకు గుర్తులకు గాను ఆయన జయంతి సందర్భంగా డిసెంబర్ 23న రైతు దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. చరణ్‌సింగ్ పోరాటంతోనే జమిందారీ వ్యవస్థ రద్దయిందని అన్నారు. అదే స్ఫూర్తితో మాజీ సీఎం కేసీఆర్ పాలన సాగించి రైతుల కోసం ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను తీసుకొచ్చారని అన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఎస్ఐ లక్ష్మీనారాయణ

పాలకవీడు, డిసెంబర్ 23: సీసీ కెమెరాలతో రక్షణ కలుగుతుందని ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ఓ వ్యాపార దుకాణంలో ఏర్పాటు చేసిన 4 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా నేరం జరిగిన వెంటనే నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నేరేడుచర్ల, డిసెంబర్ 23: మండలంలోని బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన కోన లక్ష్మమ్మ, బిక్షమయ్యకు రూ.15 వేలు, రూ. 16 వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరు కాగా, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతలపాలెం మండల పరిషత్ సమావేశం

చింతలపాలెం, డిసెంబర్ 23: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



భోజన నిర్వాహకులకు సూచనలు చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 23: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. మండల పరిధి టేకుమట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ ప్రకారం టిఫిన్, భోజనం అందించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

చెట్ల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

గరిడేపల్లి, డిసెంబర్ 23: హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయానికి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు చెట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు గీతిక, శ్రీవర్షిణి, నందిని, లావణ్య, హిరణ్మయి, కృష్ణవేణి, మేఘన, హరిణి, పరంజ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ పురస్కార గ్రహీత భాస్కర్‌కు సన్మానం



అందె భాస్కర్‌ను సన్మానిస్తున్న నాయకులు

గరిడేపల్లి, డిసెంబర్ 23: ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం అందుకున్న ప్రముఖ అంతర్జాతీయ డప్పు కళాకారుడు అందె భాస్కర్‌ను సోమవారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంపైడులు, బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డప్పును ప్రపంచ వేదిక మీద పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో డప్పు పుట్టుక మీద పీహెచ్‌డీ చేసిన గొప్ప వ్యక్తి అందె భాస్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పిడమర్తి అంజి, మాజీ సర్పంచ్ పల్లెపంగు నాగరాజు, అమరవరపు సతీశ్, జిలకర రామస్వామి, బచ్చలకూరి నాగశేఖర్, శ్రవణ్, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు సన్మానం

పీఈటీ ప్రభాకర్‌తో క్రీడాకారులు

కోదాడ రూరల్, డిసెంబర్ 23: మండల పరిధిలోని కూచిపూడి విద్యార్థులు ఈ నెల 20వ తేదీన సూర్యాపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వారితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్‌ను సోమవారం గ్రామ పెద్దలు, ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



కల్లుగీత కార్మిక సంఘం సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

నూతనకల్, డిసెంబర్ 23: ఎన్నికల సమయంలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం నూతనకల్‌లో కల్లుగీత కార్మిక సంఘం సభ్యత్వం నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. తాటిచెట్టు నుంచి కిందపడి చనిపోయిన వారికి, శాశ్వత వైకల్యం బారినపడిన కల్లుగీత కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బత్తుల జనార్ధన్, జెర్రిపోతుల కృష్ణ, నోముల వెంకన్న, బూడిద మల్లయ్య, చామకూరి రమేశ్, తొట్ల అచ్చాలు, సమ్మెట సుదర్శన్, తోణుకునూరి లింగయ్య, సైదులు, వెంకటయ్య, ఉప్పలయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి'

మఠంపల్లి, డిసెంబర్ 23: అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు అధికారులపై ఒత్తిడి తెచ్చి అర్హుల పేర్లను తొలగించి అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి ఇండ్లు కేటాయించాలని అధికారులను ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఎంతో మంది పేదలు ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి అన్యాయం చేయొద్దన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, దరావత్ హర్యానాయక్, ఎం.రాజు, పొడిచేటి రాము, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.